చెట్టు నా ఆదర్శం

ఇస్మాయిల్

స్వేచ్ఛాగానం

oooooooooo

దివిలో ఊగే విహంగాన్ని
భువిలో పాకే పురుగు బంధిస్తుంది
గడియేని ఆగని సూర్యుణ్ణి
గడియారపు బాహువులు బంధిస్తాయి
పీతడెక్కల చంద్రుణ్ణి
చేతులెత్తే సముద్రం బంధిస్తుంది
గలగలలాడే తరంగాల్ని
జలకాలాడే అంగాలు బంధిస్తాయి
తన చుట్టూ తాను తిరిగే చక్రాన్ని
మలుపులు తిరిగే రోడ్డు బంధిస్తుంది
తెగవాగే జలపాతపు నాలికని
సెగలెగిసే గ్రీష్మం బంధిస్తుంది
ముడతలుపడ్డ ముసలి సాయంత్రాన్ని
మాటలురాని కాలవ బంధిస్తుంది
రాత్రి వచ్చిన రహస్యపు వానని
ధాత్రిని దాగిన వేళ్ళు బంధిస్తాయి
గురిమరచిన గాలిబాణాన్ని,
తెరయెత్తిన నౌకాధనుస్సు బంధిస్తుంది
ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు
ఇద్దర్నీ కలిపి బంధిస్తుంది మనీష.

కాకినాడ, ఆగస్టు, 1970

మనిషీ మనిషీ!

oooooooooooooooooooooooooooooooooo

మనిషీ మనిషీ,
ఎత్తుగా ఆకాశంలో
ఎగిరే డేగని చూడు
సరిహద్దుల్లేవు దానికి
గిరిగీసుకుని కూచోదు
భూచక్రాన్ని గుండ్రంగా
చూచుకాగ్రంపై తిప్పుతుంది
స్ఫుటంగా తీక్షణంగా వీక్షించే
సూర్యనేత్రం దాని ఆదర్శం.

మనిషీ మనిషీ,
పిట్టలకు ఎగరటం నేర్పిన
చెట్టుని చూడు
ఏ భాషలో పుష్పిస్తుందది?
ఊడల నీడల్లో మాపటి వేళల్లో
ఊడల్లా కావలించుకునే
ప్రియుల హస్తాలు
ఏ భాషలో తడుముకుంటాయి?

మనిషీ మనిషీ,
పరిమళ్ళల్లో ఈదే
చిరు ఆకాశాల్నీ చిట్టి పరిగల్నీ చూడు

ఆనందపు రంగులు
చైనా వియత్నాం జపాన్ పొలాల్లో
ఎక్కడైనా
అవే కద,

మనిషీ మనిషీ,
ఉప్పు ఏ భాషలోనైనా
ఉప్పగానే ఉంటుంది.

కాకినాడ
1-11-71

చెట్టు నా ఆదర్శం
oooooooooooooooooooooooooooooooo

తరుచాపము వీడిపోయి
గురిమరచిన బాణంలా
తిరుగాడును పిట్ట.

ధరణి గుట్టు తెరవబోయి
బిరడాలో ఇస్క్రూలా
ఇరుక్కున్న పురుగు.

పురుగు సగం, సగం పిట్ట
ధరనుచొచ్చి, దివినివిచ్చి
విరులు తాల్చు తరువు

కాకినాడ

1963

వాన వచ్చిన మధ్యాహ్నం

oooooooooooooooooooooooooooooooo

బరువెక్కిన సూర్యుడు
బతకనీడు భూమిని
ఉదయమ్మొదలు
ఊపిరాడనీడు
సర్వాన్ని అదిమిపట్టి
వీర్యాన్ని విరజిమ్మాడు.

ఆకల్లాడదు.
ఏ కాకీ ఎరగని
ఏకాకి ఆకాశం.

ఇంతలో హటాత్తుగా
ఇలకు కలిగింది మబ్బుకడుపు.
వేవిళ్ళ గాలులు
వృక్షాగ్రాల్ని వూపాయి.
ధాత్రీచూచుకాలు నల్లపడ్డాయి.
తటాకాల చెంపలు తెల్లపడ్డాయి.

అవాళ మధ్యాహ్నం
అకస్మాత్తుగా దిగిన వానపొర
ఊరంతటినీ ఆవలుంచి

ఒంటరిగా నన్ను మూసింది.

ప్రపంచంతో తెగిపోయాయి
పంచతంత్రులూ,
ఆకులపై రంగులు
అంతరించాయి ముందుగా,

స్వరాలూ సువాసనలూ
విరమించాయి తరువాత.
ఆశలూ ఆశయాలూ
ద్వేషాలూ రాగాలూ
రెచ్చకొట్టే స్మృతులూ
రెక్కలు ముడిచాయి పిదప

విప్పుకున్న బతుకంతా వెనక్కి చుట్టుకుపోయి
ఇప్పుడు నేనేమీ కాను __
వర్షాగర్భంలో
వర్ధిల్లే శిశుపిండాన్ని.

నవంబర్ 1970

తాటితోపు
ooooooooooooooooooooooooooooo

నల్లటి యీ తాటివనం
అల్లిన నీడ వారిపై
ఎర్రటి సాయంత్రాన్ని

ఎక్కుపెట్టింది.

గాలి శవాన్నెత్తుకుని
కదల్లేదు తోట.
గుచ్చుకుని సంధ్యాంగుళి
గుడ్డిదయ్యె పాట.

గాలిముల్లు గుచ్చుకొని
గాయపడెను సాయింత్రం.
కాలిమసై పాట, నిలిచె
తాళవనపు అస్థికలు.

తాటితెడ్లు వేసుకుంటు
తరలిపోయె సంజ.
పాటనురగ మదినితేల
మరలివస్తి ఒక్కణ్ణీ.

మే-నవంబర్ 22, 1960

సూర్యుని చేప
oooooooooooooooooooooooooooooo

నల్లని తీపీ
నిండిన వాపీ
        ఫలాన్ని దొలచును
మెలికలు తిరుగు
చంద్రుని పురుగు;

    మనాన్ని కలచును.
కత్తుల కళ్ళు
మూయుచు చాళ్ళు
    మయాన్ని ఈదును.
అంచుల వాలు
నీడల స్కూ్రిలు
    భయాన్ని చేదును.
చుక్కల వలను
తెంచుకు కొలను
    జలాన్ని డాయునొ
సూర్యుని చేప,
ఛురిలా పాప
    ఖిలాన్ని కోయునొ.

1962-67

ఇసకలో వేళ్ళు
ooooooooooooooooooooooooooooooo

అలలు రాల్చింది మా
    కాలవ సుమము
నిలువెల్ల పాకగా
    వేసవి క్రిమము.

నేటితో సంధ్య నీ
    గుండెపై తేలదు.
నీడ లోతుగ గుచ్చి

నావ ఇక వాలదు.

జలశృంఖల తెగినా
వదలదు గట్టు
తలనిండ పిట్టలతో
ఊగే చెట్టు.

పాట లెండిన
రేవుపియానో మెట్లు
పలకరించే వేళ్ళు
పడతుల జట్లు.

ఎడబాటు తెరచీల్చి
తరుణుల వేళ్ళు
ఇసకకడుపున పోల్చు
తరువుల వేళ్ళు.

ఏప్రిల్ 66-67

ఎందుకయ్యా వుంచినావూ బందిఖానాలో
oooooooooooooooooooooooooooooooooooo

చిటపట..............
చీకటిపుటలో చినుకుబంతులు
బంతులన్నీ అదేమాట
అంతుమరచి అంటాయి.
ఎందుకయ్యా ఈ పునరుక్తి

ఎవరిదీ కుయుక్తి?

అకటకట
అర్ధరాత్రి సొరంగంలో
ఆగబోని అడుగులసడి.
దేనినించీ పలాయనం
దొరకదా ఇక విమోచనం?

చిటపట.............
ఎడతెగక మోగు విధిఢక్క
కడుపులో శూన్యపుప్రేవుని
ఏలమోగు నగార
ఎచటదీనికి మేర?

అకటకట
వికట ప్రతిబింబాల
అద్దాల చెరసాల
బందీని నేనె
బందిఖానాని నేనె.

కాకినాడ.
8-3-60

సంజ నారింజ
ooooooooooooooooooooooooooooooooooo

తొలిసంజ నారింజ ఎవరు ఒలిచేరు
తెలియెండ తొనలను ఎవరు వంచేరు?

దినపు రేకలపై వాలెను
ఇనుని సీతాకోక చిలక.
పిట్టపాటలు నీడఊటలు
చెట్టులను చేరు కృశించి.
నీడ మహాప్రేమి, వీడ
లేడు గౌరాంగి గోడను,
చుట్టిన నిశ్శబ్దపు స్ప్రింగు
చూరుకింద చేరు కుక్క.

నీడ తొడిమ తొడుగుపువ్వ
వాడనడచు పిల్లనువ్వ.
అందమైన బుగ్గపైన
బ్రాంది చుక్క పిలిచింది,
డెందమందు చిందు రాగ
బిందువొకటి ఒలికింది.

గులకరాళ్ళ పిట్టలతో
కులుకు తరుశాఖ యేరు,
వొంగిన సాయంత్రపు
రంగుల ధనస్సు
విసిరే గాలిబాణం ___
వీటికమల్లే
శాంతిని చల్లే
ఎండచట్రంలో
వెండిపిల్ల.

నెత్తురంటిన రోడ్డుబాణం
ఎత్తుకపోతోంది ప్రాణం.
అయ్యయో జారుతోంది రోజనే అపరంజిపండు
నుయ్యేదీ చేదేదీ, అందుకో చేతైతే.
వెలుగునీడలల్లి ఇలచుట్టు వలపన్ని
విధిమీనమును పట్టు వీలైతే.

కాకినాడ
ఫిబ్రవరి, 1960

కాలవొడ్డున షికార్లు
oooooooooooooooooooooooooooooooooooo
(స్నేహితుడు బిట్ర మోక్ష లక్ష్మీ నరసింహస్వామికి రాసిన ఉత్తరం)

జ్ఞాపకముందా మోక్షం!
కనీస పక్షం
మన కాలవగట్టు షికార్లు
దినాల చివర్లు.
సంధ్యాద్వయాన్ని తూస్తో
ములుచూపు రస్తా __
ఒకటి నభాన, యేటి
కరాన మరోటి,
గాజుల గలగలతో మొరసి
రంగులతో మెరసి,
ఎగిరే సంజగాలిపడగ

తూలిపడగ
కాలవలో మాత్రం
సంధ్యా సూత్రం
చీకట్లను చీలుస్తో
నిలుచు జ్వలిస్తో.
ఇవాళ మన దోస్తీ
ఒక్కణ్ణీ మోస్తీ.

కాకినాడ
ఏప్రిల్ 1964

గురుత్వం
oooooooooooooooooooooooo

గోడమీది నీడల్లా __
గురుత్వాన్ని మరచి
ఎండపొడల బంతులతో
ఇటూఅటూ పరచి __

ఊహలను అతీతముగ
ఉంచుగోరు మనము.
కాని గోడపైని నీరు
కారు తడిపసనము

వలె దిగలాగు దిగులుగా
ఇల చీకటి కేంద్రానికి.

ఏప్రిల్ 1967

ఔఆఒఊ ఓఖజఊ, ఽఖఎ జఆఖ
౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦

మోహానికీ
మోహరానికీ
రవంతే తేడా.

ప్రేమికుడికీ
సైనికుడికీ
ఒకటే ఏకాగ్రత!
ప్రియుడి కంటికొసని
ప్రేయసి నిత్యం జ్వలిస్తే
జవాను తుపాకి తుదని
శత్రువు నిశ్చలంగా నిలుస్తాడు.

స్మరరంగంలో లేచే సుడిగాలే
సమరరంగంలో పిడికిలి బిగిస్తుంది.
కోరికల తుఫానుకి
కొంకర్లు తిరిగే నరాలచెట్టులా
సంకుల సమరంలో
వంకర్లుపోయిన ముళ్ళకంచెలూ మెషీన్‌గన్లూ.

మృత్యుభంగిమలకి
రత్యంతభంగిమలకి
వ్యత్యాసం ఉందంటారా?

ఉవ్వెత్తుగా లేచిపడి
ఉద్రేకపు చివర్ల
బిగుసుకునే దేహాలకి కారణం
భావప్రాప్తా, అభావమా?

ఐతే,
బుద్ధిగా ప్రేమించుకోక
యుద్ధాలెందుకు చేస్తారో
నాకర్థం కాదు.

3-12-20, 1971

ప్రేమ రెండు రకాలు
oooooooooooooooo ooooooooooooo

ఏకైక మహాప్రేమ
ఒక్కొక్క జీవితపు ని
సర్గాన్ని మహానదిలా
శాసిస్తుంది.

ఏకాకి బాటలల్లే
నా కానబతుకులోన
జరతారు వాగులెన్నో

జతపడ్డాయి.

మెరపువేళ్ళు తన్ని జల
ధరము మొలచి తలకిందుగ
పాడే పిట్టలతో
పాదపముపలె శ్రమదీర్చు.

మెయిలింజను నంటి, నది
పయనించు నొకేదారి.
పట్టాలు లేని ఝరులు
పరుగులిడు స్వేచ్ఛగా,

మళ్ళునింపి నదినేసే
గళ్ళదుప్పటీ బతుకు
వేగలేను బొత్తిగా.

జరతారు వాగులతో
పరదాసై సరదాగా
ఊగెద చిరుగాలిలో.

కాకినాడ,
1964

వేయి పిర్రల సముద్రం
(స్మైల్ కి __
ఈ పద్యం మీకిష్టం కనుక)
oooooooooooooooooooooooooooooooooo

ఊగుతోంది వేయిపిర్రల సముద్రం
ప్రియా, నిర్నిద్రం
లాగుతోంది స్మృతినౌకను ఉప్పాడకు
ప్రియా, నీ జాడకు

మొగ్గి చూస్తోంది రెప్పలేని కన్ను
ప్రియా, మిన్ను
సిగ్గు లేని సాగరం వర్తించు నగ్నంగా
ప్రియా, ఉద్విగ్నంగా

పాదుకొన్నాయి మనలో కడలిఊడలు
ప్రియా, మన నాడులు
ఈదు నిశ్శబ్దపు చేపలు రొదనిచీలుస్తో
ప్రియా, నను పిలుస్తో

నురుగులుకక్కే సాగరతీరాన
ప్రియా, రతీపరాన
విరగనితరగలం మనంమాత్రం
ప్రియా, విచిత్రం

ఎండ్రకాయల్ని తోలే ఏటవాలు సూర్యుడు
ప్రియా, అనార్యుడు
పండువంటి నీమేను స్పృశిస్తాడు
ప్రియా, కందిస్తాడు

అల్లుతోంది అలలపై చంద్రుని సాలీడు
ప్రియా, తనగూడు
అందుకో ఆహ్వానం ప్రవేశించు జాలంలో

ప్రియా, ఇంద్రజాలంలో

చుట్టుకుపోయిన నరాలతో
ప్రియా, కరాలతో
పెట్టుతోంది సంద్రం నిరంతరం రొద
ప్రియా, విను దానిసొద

చుట్టుకుపోయే శంఖాన్నడుగు
ప్రియా, ఎదనడుగు
చూరుకింద చుట్టుకునే హోరుగాలి చెప్పదా
ప్రియా, మనకథ విప్పదా

వేగలేను కడలిమ్రోల అహరహం
ప్రియా, నీ విరహం
ఊగుతోంది వేయిపిర్రల సముద్రం
ప్రియా, నిర్నిద్రం.

కాకినాడ
23-9-1970